
విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందిస్తా

- 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్
- పైలట్ ప్రాజెక్టుగా గర్షకుర్తి పాఠశాల
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, సెప్టెంబరు 25: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన సొంత ఖర్చులతో అల్పాహారం అందిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బుధవారం గంగాధర మండలం గర్షకుర్తిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్, సాక్సుల జతలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, సాయంత్రం 10 తరగతి విద్యా ర్థులకు స్నాక్స్ అందిస్తానన్నారు. గర్షకుర్తిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పంచాయతీ రాజ్ నిధులతో నిర్మించనున్న గంగాధర, కాసారం రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గంగాధర ప్రజా కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు మంజూరైన 7.49లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో డీఈవో జనార్దన్‌రావు, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, ఎంఈవో వేణు కుమార్, ప్రధానోపాధ్యాయుడు శశికాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మ న్ రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిరు మలరావు, నాయకులు గునుకొండ బాబు, కల్వ కోట శ్రీనివాస్‌రావు, పురమల్ల మనోహర్, చక్రపాణి పాల్గొన్నారు.



ప్లాట్లు అమ్మారు.. పాట్లు మిగిల్చారు..

- అంగారిక టౌన్‌షిప్‌లో కనీస వసతులు కరువు
- రెండేళ్లయినా ప్రారంభం కాని అభివృద్ధి పనులు
- ప్లాట్ల వేలంతో ప్రభుత్వానికి రూ. 147 కోట్ల ఆదాయం
- వసతులకల్పనకు ఇచ్చింది 5.18 కోట్లు
- ఆందోళనలో ప్లాట్ల యజమానులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'అంగారిక టౌన్‌షిప్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం.. ఈ టౌన్‌షిప్ కరీంనగరకే తలమానికంగా ఉంటుంది.. విశాలమైన రోడ్లు, డ్రైనేజీలు, నీటి వసతి, అందమైన పార్కులు, గేటెడ్ కమ్యూనిటీని తలదన్నేలా చుట్టూ ప్రహరీ, స్వాగత తోరణం, విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తాం.. 47 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము' అంటూ ప్రీబిడ్ సమావేశంలో అధికారులు ప్రకటించి అరచేతిలో అద్భుతాన్ని చూపించారు. ఆ తర్వాత మరిచిపోయారు. తిమ్మాపూర్ మండలంలోని 85 ఎకరాల రాజీవ్ స్వగృహ స్థలాన్ని 819 ప్లాట్లుగా విభజించి అంగారిక టౌన్‌షిప్ పేరిట వేలం వేశారు. ప్రభుత్వానికి 147 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. అంగారిక కథ అక్కడితో కంచికి చేరింది.

నాలుగు విడతల్లో.. 787 ప్లాట్ల విక్రయం

2022 జూన్‌లో ఈ టౌన్‌షిప్ ప్లాట్ల వేలం పాటలను ప్రారంభించి నాలుగు విడతలుగా 2023 నవంబరు వరకు 787 ప్లాట్లను విక్రయించారు. గ్రీన్ ఫీల్డ్‌లో అందంగా తీర్చిదిద్దే టౌన్ షిప్‌లో సొంత ఇంటి వాళ్లమవుతున్నామని రిటైర్డు ఉద్యోగులు, మధ్యతరగతి జీవులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే నాలుగు రెట్లు ఎక్కువే చెల్లించి ప్లాట్లను కైవసం చేసుకున్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో రాజీవ్ స్వగృహకు చెందిన 85 ఎకరాల స్థలాన్ని 819 ప్లాట్లుగా విభజించి గజం కనీస ధర ఆరు వేలు, కమర్షియల్ ధర ఎనిమిది వేల రూపాయలుగా నిర్ణయించారు. ప్రభుత్వం నిర్మించే టౌన్‌షిప్ కావడంతో తొందర్లోనే అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజలు గజం ఎనిమిది వేల నుంచి 28 వేల రూపాయల వరకు చెల్లించి ప్లాట్లను తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు వేలంలో స్థలాన్ని కొనుగోలు చేసిన కారణంగా కొన్న ధరకు స్టాంపు డ్యూటీ తీసుకొని రిజిస్ట్రేషన్లు చేశారు. దీంతో ప్లాట్ల వేలంతోపాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా కూడా భారీగా ఆదాయం సమకూరింది.


రాజీవ్ స్వగృహ స్థలంలో సదుపాయలు లేకపోవడంతో బేస్‌మెంట్ కట్టి వదిలేసిన యాజమాని

ప్రతిపాదనలకే పరిమితం

ప్లాట్లు వేలం వేసి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం టౌన్‌షిప్‌లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుద్దీపాలు, మంచినీటి వసతి లాంటి కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ప్లాట్ల యజమానులు లబోదిబోమంటున్నారు. ప్రీ బిడ్ సమావేశాల్లో ప్రభుత్వానికి 47 కోట్లతో కనీస వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించామని జిల్లా అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. ప్లాట్ల అమ్మకాలు పూర్తయిన తర్వాత అధికారులు మొక్కుబడిగా 5.18 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పాక్షికంగా విద్యుత్ పోల్స్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను వేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. రోడ్లుగానీ, డ్రైనేజీల పనులుగానీ చేపట్టకపోవడంతో ప్లాట్ల యజమానులు తమతమ ప్లాట్లలోకి వెళ్లి పనులు చేసుకునే అవకాశం లేకుండా పోతున్నది. ఇళ్లు నిర్మించుకున్నా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు సౌకర్యం లేకుండా కనీసం రక్షణ ఇచ్చే కాంపౌండ్ వాల్ లేకుండా నగరానికి 12 కిలోమీటర్ల దూరంగా ఉండడమేలా అని ఆందోళనకు గురవుతున్నారు. సుడా పరిధిలోకి వచ్చే ఈ టౌన్‌షిప్ అభివృద్ధి బాధ్యతను ఆ సంస్థనే చేపట్టాల్సి ఉన్నది. ఇటీవల సుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అంగారిక టౌన్‌షిప్‌లో అత్యవసర పనులు చేపట్టడానికి 20 కోట్లరూపాయల అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. తమకు ఇచ్చిన హామీ మేరకు అంగారికను అందమైన టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దడానికి నిధులు కేటాయించి తమకు నివాసయోగ్యంగా మార్చాలని ప్లాట్ల కొనుగోలుదారులు డిమాండ్ చేస్తున్నారు. 147 కోట్ల రూపాయల ఆదాయం పొందిన ప్రభుత్వం మరో 10 కోట్ల విలువ చేసే ప్లాట్లు అమ్ముకునే వీలున్నది. తొలుత చేసిన ప్రతిపాదనల మేరకు 47 కోట్లను వెంటనే కేటాయించి కనీస సౌకర్యాలను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రెండేళ్లయినా అమలుకు నోచుకోని హామీలు

- ఎం రఘుశంకర్‌రెడ్డి, అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



రాజీవ్ స్వగృహ స్థలాన్ని ప్లాట్లుగా అమ్ముకున్న ప్రభుత్వం 147 కోట్ల రూపాయలు ఖజానాకు జమచేసుకొని రెండేళ్ళు గడిచింది. ఇప్పటికీ అంగారిక టౌన్‌షిప్‌లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రీబిడ్ సమావేశాల్లో అధికారులు ఇచ్చిన హామీ మేరకు రోడ్లు, డ్రైనేజీలు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పార్కులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధానంగా సీసీ రోడ్లు వేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని, అందరికీ రక్షిత మంచినీటి వసతి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చారు. ఈ హామీలను విశ్వసించే బహిరంగ వేలంలో ఎక్కువ ధర చెల్లించి ప్లాట్లు కొన్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయి సౌకర్యాల కల్పనను విస్మరించింది. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదన

- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్



తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని రాజీవ్ స్వగృహ స్థలంలో ప్లాట్లుగా విక్రయించిన అంగారిక టౌన్‌షిప్‌లో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి వసతి వంటి సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు 20 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే టెండర్లు నిర్వహించి టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తాం.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 25: సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. బుధ వారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయ న మాట్లాడుతూ 15 రోజులుగా రైతులు కొత్త పత్తిని మార్కెట్‌లోకి తీసుకు వస్తున్నారన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో దళారులు తక్కువ ధరకు కొంటున్నారని, రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులకు మద్దతు ధర వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, డి నరేష్‌పటేల్, జి తిరుపతి, భాస్కర్ పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



నగరంలోని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 25: నిత్యావసరాల ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నగరంలోని అనభేరి విగ్రహం నుంచి ప్రకాశం గంజ్ వరకు ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, నూనె ప్యాకెట్లు, తలపై, మెడలో వేసుకుని బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ పేదలను పట్టించుకోవడ లేదన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 12 శాతం ధరలు పెంచి పేదల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ప్రజల కనీస అవసరాలు తీర్చడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అధికారులు, రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు సరుకులను బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు పట్టించుకోవడం లేదని, వ్యాపారులు నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో గోదాములపై దాడులు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

మట్టిని తోడేస్తున్నారు..

- వందలాది టిప్పర్లతో మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు


రంగాపూర్‌లో గుట్ట మట్టిని తోడేయడంతో ఏర్పడిన గుంత

హుజూరాబాద్, సెప్టెంబరు 25: మొన్నటి వరకు ఇసుక మాఫియాను చూశాం.. ఇప్పుడు హుజూరాబాద్‌లో మట్టి మాఫియా తయారైంది. గుట్టలు ఉంటే చాలు.. కొందరు అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా టిప్పర్లతో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి, గణేష్‌నగర్, బోర్నపల్లి, ఎలబోతారంలో గుట్టలు ఉన్నాయి. దీంతో కొంత మంది అక్రమార్కులు మట్టిని ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్న సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ గుట్టల నుంచి బహిరంగంగా ఎక్స్‌కవేటర్ల సహాయంతో తవ్వుతున్నారు. హుజూరాబాద్‌లో ఇటీవల ఇళ్ల నిర్మాణం బాగా పెరిగింది. మట్టి అవసరం పెరిగింది. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యక్తులు మట్టిని వ్యాపారం చేస్తున్నారు. హుజూరాబాద్‌లో టిప్పర్‌కు 1,500 నుంచి రెండు వేల రూపాయల వరకు తీసుకొని గుట్టలను తవ్వి మట్టిని సరఫరా చేస్తున్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. గుట్టల నుంచి మట్టిని తరుచూ తోడేస్తుండడంతో గుట్టల్లో నివసించే వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ గుట్టలపై గతంలో పశువులను మేపుకునేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని గొర్ల కాపర్లు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది గుట్టల నుంచి మట్టిని తీసుకొచ్చి కొత్తపల్లి, గణేష్‌నగర్‌లలో డంప్ చేస్తున్నారు. ఈ మట్టి తరలిస్తున్న టిప్పర్లతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు గుట్టలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.


రంగాపూర్, కొత్తపల్లి గుట్టల నుంచి మట్టిని తోడేస్తున్న ఎక్స్‌కవేటర్

అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

- నేర సమీక్షా సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 : కమిషనరేట్ వ్యాప్తంగా అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీ అభిషేక్ మొహంతి పోలీస్ అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, ఎస్‌హెచ్‌వో (స్టేషన్ హౌస్ ఆఫీసర్)లతో నేర సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులంతా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, వార్డుల సందర్శించి ప్రజలతో సమావేశాలు నిర్వహించాల న్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉండి, రాజీకి వీలుగా ఉన్న కేసులను లోకదాలత్‌లో పరిష్కరించుకునే లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100కు వచ్చే ప్రతీ ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాల న్నారు. నార్కోటిక్ కంట్రోల్ సెల్ సహాయంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ద్వా రా కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు సైబర్ వారియర్లు స్పందించి బాధితులకు సహకరించి 1930కి, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కు సమాచారం అందించాల న్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు కారణాల ను సీపీ తెలుసుకున్నారు. సమావేశం లో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్(సీఎస్‌బీ), నరేంద ర్, వెంకటరమణ, విజయ్‌కుమార్, వేణుగోపాల్, కాశయ్య, మాధవి, సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏసీపీ నర్సింహారెడ్డి, సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

పోలీసులకు డ్యూటీమీట్ పోటీలు

కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి వివిధ విభాగాల్లో కమిషనరేట్ స్థాయిలో బుధవారం కమిషనరేట్ కేంద్రంలో డ్యూటీమీట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీపీ అభిషేక్ మొహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి డ్యూటీమీట్ ఎంపిక కోసం కమిషనరేట్, జిల్లాల వారీగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పలు విభాగాలు, అంశాలపై పోటీలు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని జోనల్ స్థాయి, రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి శిక్షణ అనంతరం ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన

● వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గంగాధర, సెప్టెంబరు 25: వరి గొలక దశలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సిఫారసుతో మందులు పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం గంగాధర మండలం నారాయణపూర్, కురిక్యాల, గట్టుబూత్కుర్ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, డీఏవో, ఏడీఏలు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఎక్కువగా బ్యాక్టీరియా, ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాము పొడ తెగులు, సన్న రకం వరికి ఆకునల్లి, కంకినల్లి సోకుతున్నట్లు గుర్తించి రైతులకు తగిన సహాలు, సూచనలు అందించారు. పూత దశలో ఉన్న వరికి కాపర్ సంబంధిత మందులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు గోపీచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టు

శంకరపట్నం, సెప్టెంబరు 25: శంకరపట్నం మండలం జాతీయ రహదారి నుంచి మొలంగూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో కావేరి సీడ్ ప్లాంట్ సమీపంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమా దకరంగా ఉంది. ఆ చెట్టు విరిగి పడితే రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే చెట్టును తొలగించా లని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి

గంగాధర, సెప్టెంబరు25: దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తముల తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియారిటీ గల ఎస్జీటీలకు గత జీవోలను సవరించి బీఈడీ అర్హత ఉన్న వారికి పదోన్నతి కల్పించాలన్నారు. సంవత్సరకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కిషన్‌రెడ్డి, పెరుక నర్సయ్య, జిల్లా నాయకులు సముద్రాల అంజయ్య, గంగాధర మండల నాయకులు పాల్గొన్నారు.

వెంటాడిన విషాదం

- అనారోగ్యంతో కుటుంబ పెద్ద మృతి
- మృతదేహాన్ని ఇంటికి తీసుకురానివ్వని ఇంటి ఓనర్
- గ్రామ శివారులోనే మృతదేహం
- గ్రామస్థుల సాయంతో అంత్యక్రియలు పూర్తి


మృతుడి కూతుళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కోట లక్ష్మణ్ (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : ఇంటి పెద్దాయన కష్టం చేస్తే తప్ప కడుపు నింపని ఆ కుటుంబంపై విధి పగబట్టింది. హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్(55), ప్రేమలత దంపతులు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వివాహం చేశారు. మంగళవారం లక్ష్మణ్ అకస్మాతుగా కిందపడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థుల సహకారంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ఇంటి యజమాని మృతదేహాన్ని తీసుక రావద్దంటూ ఆదేశించడంతో గ్రామ శివారులో మృతదేహాన్ని ఉంచారు. అంత్యక్రియలు చేసేందుకు కూడా చేతిలో డబ్బులు లేక భార్య ప్రేమలత దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులందరూ ముందుకు వచ్చి తలాకొంత పోగుచేసి రూ. 80వేల ఆర్థికసాయం అందించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అంత్యక్రియల కోసం కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25: జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర రూ.7,600 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 30 మంది రైతులు 149 క్వింటాళ్ల విడి పత్తి, 11 మంది రైతులు 154క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ క్రికెట్ పోటీకి అండర్ 19 విభాగంలో యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఎదులాపూర్ గ్రామానికి చెందిన బోల్లా సాహితికుమార్, హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. క్రికెట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌సీ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ వారు అండర్ 19విభాగంలో అక్టోబర్ 20 నుంచి 29వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీకి ఎంపిక చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబరు 25 : మండలంలోని చిప్పలపెల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆవునూర్ ఎగువ మానేరు వాగు నుంచి ఐదు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, సెప్టెంబరు 25 : మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామం వద్ద మోయతుమ్మెద వాగులో బుధవారం చుట్టి ఉన్న కవర్‌లో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా జాలర్లు గుర్తించి బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉంటుంది. మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండటంతో అక్కడే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వడ్లూరి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు


జంగపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన కలప

గన్నేరువరం, సెప్టెంబరు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికివేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గ్రామాలలో రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేసి లారీలలో లోడ్ చేసి తరలిస్తున్నారు.

జంగపల్లి గ్రామంలో స్మశాన వాటిక పక్కన పెద్ద ఎత్తున కలప నిల్వ చేశారు. ఇక్కడి నుంచి లారీలలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసులు కలప అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు అధికారులు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతుంటే కలప వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా కలప అక్రమ రవాణాను నివారించాలని కోరుతున్నారు.

చిన్న దేవాలయాల ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

● టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్


ఆలయ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో పెద్ద దేవాలయలైన వేములవాడ, యాదాద్రి, భద్రాచలం ఆలయాల మాదిరిగానే చిన్న దేవాలయాలైన కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగులకు సైతం పీఆర్సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ 261 జీవోను సవరించాలని, ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని అన్నారు. పని గంటలతో నిమిత్తం లేకుండా అవసరానికి మించి ఉద్యోగులు పని చేశారని గుర్తు చేశారు. ఆలయాల్లో భక్తుల సంఖ్య ఎక్కువ ఉన్నందున క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో దేవాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. క్యాడర్ స్ట్రెంత్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీలు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. స్పౌస్‌లో కూడా ఇష్టారీతిన బదిలీలు చేశారని విమర్శించారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలకు పనిభారం అధికంగా ఉందని, హాస్టల్ వెల్ఫేర్, పంచాయతీ కార్యదర్శిల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పారిశుధ్య కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కొమురవెల్లి, కొండగట్టు ఆలయాలకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ కార్యవర్గం

● చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు ఎన్నిక


రాష్ట్ర చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్రదేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా వేములవాడ రాజన్న ఆలయ ఏఈవో గజవెల్లి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ చైర్మన్‌లుగా ఉపాధ్యాయుల చంద్రశేఖర్, బుద్ది శ్రీనివాస్, సుదర్శన్, గౌరవ సలహాదారులుగా దయాకర్, భాస్కర్, హరికిషన్, కృష్ణ, నమిలికొండ ఉమేశ్‌శర్మ, వరి నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు, కపీంద్రా చారి, మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌లుగా మల్లికార్జున్, నిరంజన్, పీచర రంగారావు, సువర్ణరా ధాకిషన్, శ్రావణ్‌కుమార్, స్వామి, సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శిసాయి, కార్యదర్శులు గా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్ కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధర్‌శర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు గా కట్కూరి వెంకటయ్య, మహేష్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నరసింహుని ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

● ఆదాయం రూ 47.70 లక్షలు

ధర్మపురి, సెప్టెంబరు 25 : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా 47,70,995 రూపాయల ఆదాయం లభించింది. జూన్ 12నుంచి సెప్టెంబరు 25వరకు గల 105 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 50 గ్రాముల మిశ్ర మ బంగారం, నాలుగు కిలోల 700 గ్రాముల మి శ్రమ వెండి, 90 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, యూబీఐ మేనేజర్ ఆశిష్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 33,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 33,238 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, రెండు వరద గేట్లు ఎత్తడం ద్వారా 6,248 క్యూసెక్కుల నీరు దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువకు 1,200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మధ్య మానేరు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు.

30న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సీనియర్ బాలురు, బాలికలకు ఎంపిక పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9నుంచి రంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో 30న ఉదయం 10గంటలకు అసోసియేషన్ కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9441 92807, 8978995730, 9550942180 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజుఃనునన అక్టోబరు 5లోగా చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబరు 9లోగా చెల్లించాలన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మరొకరికి 10 ఏళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 25 : ఓ వ్యక్తి హత్యకు కారణమైన ఇద్దరిలో ఒకరికి జీవిత ఖైదు రూ.2500 జరిమానా, మరొకరికి 10 సంవత్సరాల జైలు శిక్ష రూ.2500 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం ముస్తాబాద్‌కు చెందిన పండుగ రాజం తండ్రి రాములుకు పండుగ మరియమ్మకి ఆస్తుల పంపకాల విషయంలో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పండుగ రాజంను 1 సెప్టెంబరు 2020న పండుగ మరియమ్మ ఆమె కుమారుడు పండుగ మల్లేశం గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేశారు. పండుగ మరియమ్మ, మల్లేశంను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టులో 15మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించారు. కేసు పూర్వాప రాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పండుగ మరియమ్మకి పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2500 జరిమానా, పండుగ మల్లేశంకు జీవిత ఖైదుతో పాటు రూ.2500 జరిమానా విధించారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట సొంత పట్టా భూమి

గొల్లపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని గుంజపడుగు గ్రామంలో తన సొంత పట్టా భూమి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరిట రికార్డుల్లోకి ఎక్కడంతో ఓ వృద్ధుడు తీవ్ర మనస్తాపం చెంది సదరు నకిలీ పట్టాదారు ఇంటి ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుక్క లింగయ్య (78)కు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 74లో 0-14 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా లింగయ్య భూమి సాంకేతిక కారణాల వల్ల గ్రామానికి చెందిన నవ్య రమేష్ అనే వ్యక్తి పేరిట రికార్డుల్లో తప్పుగా నమోదైంది. దీనిపై లింగయ్య రెవెన్యూ కార్యాలయం చుట్టూ, రమేష్ ఇంటి చుట్టు రెండేళ్లుగా తిరుగుతున్నాడు. అయినప్పటికి అధికారులు పట్టించుకోలేదు. అసలు ఆ సర్వే నంబరులో రమేష్‌కు ఎలాంటి భూమి లేకున్నా తన భూమి అన్నట్లు వ్యవహరిస్తూ తీవ్రమానసిక క్షోభకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబసభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. ఈ సంవత్సరం మార్చి నెలలో ఎట్టకేలకు పట్టా చేస్తానని రమేష్ చెప్పడంతో ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, మళ్లీ పట్టా చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లింగయ్య పురుగుల మందు డబ్బాతో రమేష్ ఇంటికి వెళ్లి ఇంటి ముందర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాగి వైరు చోరీ

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 : సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. కరీంనగర్ వైపు రాజీవ్ రహదారిని ఆనుకుని శాస్త్రినగర్ ప్రాంతంలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాత్రి దొంగలు ముఖాలకు మాస్కులు ధరించి వచ్చి కేంద్రంలోని కిటికీల గుండా లోనికి ప్రవేశించారు. అందులో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి దొంగతనానికి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన మూడున్నర క్వింటాళ్ల రాగి వైరును ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీస్ అధికారులు బుధవారం సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇతర ఆధారాల కోసం అన్వేషించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● బైక్ చోరీ

ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో చోటు చేసుకుంది. భైరోగని రవీందర్‌గౌడ్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచగా బుధవారం తెల్లవారి లేచి చూసేసరికి వాహనం కనిపించకుండాపోయింది. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దొంగ బైక్‌ను ఎత్తుకెళుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

వేములవాడ, సెప్టెంబర్ 25 : యాభై వేల రూపాయల నగదు దొంగలించిన సంఘటనలో ఒకరికి 18 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం మీడియాకు వివరించారు. గతేడాది ఆగస్టు 15వ తేదీన వేములవాడలోని మోత్కుపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి షాప్‌లోని క్యాష్ కౌంటర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేష్ 50 వేల రూపాయలు దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అధికారి ఎస్ఐ అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి కాశెట్టి వెంకటేష్‌కు 18 నెలల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుతో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

శంకరపట్నం, సెప్టెంబరు 25 : శంకరపట్నం మండలం అర్కండ్ల శివారులో పిడుగు ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. గ్రామస్థుల సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో మెరుపులతో పెద్ద శబ్ధంతో పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లు తెలిపారు.

జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు

జమ్మికుంట, సెప్టెంబరు 25 : జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. పగలు సీసీ కెమరాలు లేని ప్రాంతాలను గుర్తిస్తూ రాత్రి వేళల్లో పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒకే రోజు రాత్రి ఇరువై ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను తీశారు. సుమారు 50లీటర్ల వరకు పెట్రోల్ ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచి, పెట్రోల్ చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీవో 25 నిబంధనలు మార్చాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 25 : రేషనలైజేషన్ జీవో 25ను నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన జీవోను అమలు చేయాలని కలెక్టర్లను పాఠశాల విద్యాసంచాలకులు ఆదేశించడాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబంధమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయక పోవడం పట్ల మహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 317లో నష్టపోయిన వారికి సొంత జిల్లాలకు పంపాలని పెండింగ్ బిల్లులు డీఏలు మంజూరు చేయాలని పీఆర్సీ ప్రకటించి అమల చేయాలన్నారు. రాష్ట్ర ఈసీ మెంబర్ ఉమా బాలచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రామానాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట్యాగిరి బాల్‌రాజు, కార్యదర్శి కరికె ప్రకాష్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

గవర్నర్ అవార్డుకు ఎంపికైన ఖని విద్యార్థులు


తృతీయ సోపాన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25: గోదావరిఖనిలో ఇటీవల జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణ శిబిరంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి గవర్నర్ అవార్డుకు అర్హత సాధించారు. హర్షవర్ధన్, భానుప్రసాద్, మణిదీక్షిత్, సలీంపాషా, సాయికృష్ణ, కౌశిక్, మారుతి ఎంపికయ్యారు. తృతీ య సోపాన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు జింక మల్లేష్, స్కౌట్ మాస్టర్ నీలిమ, ఉపాధ్యాయులు రమ, ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్, అరుంధత, మనోహర్ శాస్త్రి అభినందించారు.

గంజాయి అమ్మిన వ్యక్తి అరెస్ట్

● 350 గ్రాములు స్వాధీనం


అరెస్ట్ చూపుతున్న సీఐ నిరంజన్ రెడ్డి

మెట్‌పల్లి, సెప్టెంబరు 25 : దారి దోపిడీ కేసులో నిందితులకు గంజాయి అమ్మిన వ్యక్తిని బుధవారం పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. ఈనెల 21న ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగాపూర్ క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసి విచారించారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన చందు వారికి గంజాయి అమ్మినట్లుగా తెలిపారు. దీంతో మెట్‌పల్లి డీఎస్పీ ఆదేశాలు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చందు తన ఇంటివద్ద ఉన్నాడని పక్కా సమాచారం మేరకు చందు ఇంటి వద్దకు వెళ్లి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అతడిని విచారించగా గంజాయి అమ్మినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కుమార్, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజును అధికారులు అభినందించారు.

పోలీసుల జోక్యంతో ముగిసిన యువకుడి అంత్యక్రియలు


జగ్గసాగర్‌లోని సమస్యను తెలుసుకుంటున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అనే యువకుడి అంత్యక్రియలు పోలీసుల జోక్యంతో బుధవారం నిర్వహించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంతల దంపతుల కుమారుడైన ఏనుగు ప్రభాస్ మనస్తాపానికి గురై ఈనెల 8న ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈనెల 24న ప్రభాస్ మృతి చెందాడు. ప్రభాస్ ఆత్మహత్యకు తల్లే కారణమని ఆమెపై గ్రామంలోని కులస్తులు దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువకుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తండ్రి ఏనుగు ప్రతాప్‌పై చేసి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని కుటుంబ సభ్యులు, కులస్తులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు అక్కడి చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. తల్లి పేరు మీద ఉన్న ఆస్తి భర్త ప్రతాప్ పేరు రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని పేర్కొన్నారు. పోలీసులు కలగజేసుకుని అంత్యక్రియలు జరిగిన తరువాత కుటుంబసభ్యులు, బంధువులు, కులస్తుల కలిసి సానుకూలంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఎలాంటి గొడవలు జరగకుండా రక్షణ కల్పిస్తామన్నారు. దీంతో వారు శాంతించి ఆ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

బ్రిడ్జిపై రహదారికి మరమ్మతులు

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



బ్రిడ్జిపై జరుగుతున్న మరమ్మతు పనులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 25: కరీంనగర్ మండలం ఇరుకుల్ల, వల్లంపహాడ్ ప్రధాన రహదారులపై గుంతలు పడగా అధికారులు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ఆదిమారిస్తే అంతే..' అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా కరీంనగర్ మండలం వల్లపంహాడ్, ఇరుకుల్ల బ్రిడ్జిపై ఉన్న రహదారి వెంబడి ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జిపై ఇనుప చువ్వలు తేలగా వాటికీ మరమ్మతులు చేపడుతున్నారు. బ్రిడ్జిపై గుంతలు పడ్డ రహదారులను పూడ్చే పనిని చేపట్టారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కాశెట్టి లావణ్య-శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 25: దసరా పండుగను పురస్కరించుకుని కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి(2వ డివిజన్) కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. శానిటేషన్, నీటి సరఫరా, ఎలక్ట్రికల్ కార్మికులకు బట్టలను పంపిణీ చేశారు. కార్పొరేషన్ ప్రజలకు అన్ని రకాలుగా సహకారాన్ని అందించాలని బతుకమ్మ ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను కోరారు.

హాలీవుడ్‌లో కరీంనగర్ యువకుడు

-'ది డిజర్వింగ్' సినిమా నిర్మాణం



ఫిల్మ్ ఫెస్టివల్‌లో వెంకట్‌సాయి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25: కరీంనగర్‌లోని భగత్‌నగర్, శ్రీరామ కాలనీకి చెందిన గుండ శ్రీనివాస్-సునిత దంపతుల కుమారుడు వెంకట్‌సాయి అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సినిమా రంగంపై మక్కువ పెంచుకున్నాడు. 'తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే' అనే ఇతివృత్తంతో అమెరికాలో 'ది డిజర్వింగ్' అనే సినిమా తీశారు. దీనికి స్టోరీ, స్క్రీన్ ప్లే, ప్రొడ్యూసర్, డైరెక్టర్, మెయిన్ హీరో ఆయనే కావడం విశేషం. తన తల్లిదండ్రులను, అక్కడ ఉంటున్న విదేశీయుల్ని పాత్రలుగా తీసుకున్నారు. తక్కువ బడ్జెట్‌లో ఈ సినిమా తీయగా 15 రోజుల ముందు విడుదల చేసిన సినిమా ట్రైలర్ సెన్సేషన్ అయ్యింది. అక్టోబర్ 1న విడుదల చేయనున్నారు. ఇటీవల స్పెయిన్ దేశం బార్సిలోనాలో సెప్టెంబరు 17 నుంచి 21 వరకు జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. త్వరలో సినిమా తెలుగులోకి కూడా డబ్బింగ్ చేయనున్నారు.

టెండరు ఖరారు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25: నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల్లో టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకునే హక్కు కోసం బుధవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ పర్యవేక్షణలో వేలం నిర్వహించగా 3,35,300 రూపాయల హెచ్చు పాట వచ్చిన కారణంగా టెండరు ఖరారు చేసినట్లు ఈఓ కొస్న కాంతారెడ్డి తెలిపారు. దీక్షా సమయంలో అన్నదానం, అల్పాహారం, ఉచిత టీ పంపిణీకి అవసరమయ్యే కిరాణా సామాను, పాలు, పెరుగు, నెయ్యి, టెంట్ సామాగ్రి, తడకల పందిళ్ల కోసం నవంబరు 4న కొటేషన్లు కోరుతున్నామని తెలిపారు. టెండరు కార్యక్రమంలో సిబ్బంది బి కృపాకర్, యు శ్రీనివాస్, అశోక్, పాటదారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 25: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో గంటల ప్రతిపాదికన బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయిలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీటీ తెలుగు, టీజీటీ హిందీ పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు పోస్టుకు ఎంఏ (తెలుగు) బీఈడీ, హిందీ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులలో డిగ్రీ, హెచ్‌పీటీ చేసి ఉండాలని, అభ్యర్థులు టెట్ అర్హత కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

మానకొండూర్, సెప్టెంబరు 25: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి సూచించారు. తమశీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మృతి చెందిన ఓటర్లను తొలగించి, నూతన ఓటర్ల నమోదుతో పాటు వివాహం అయిన వారి ఓటును జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌వోలకు సూచించారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వినతి

గన్నేరువరం, సెప్టెంబరు 25: రెవెన్యూశాఖలో కింది స్థాయి సిబ్బందిగా వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తూ తక్కువ సర్వీస్ చేసి ఎలాంటి బెనిఫిట్స్ పొందకుండా రిటైర్డ్ అవుతున్న వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని మండలంలోని రిటైర్డ్ వీఆర్ఏలు బుధవారం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 2500 రిటైర్డ్ వీఆర్ఏ దళిత కుటుంబాలు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం పొందక రోడ్డున పడ్డాయన్నారు. కార్యక్రమంలో రిటైర్ అయిన పూర్వ వీఆర్ఏలు పురం మల్లవ్వ, పేరోజి సూరవ్వ, కూన కనుకయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యం

తిమ్మాపూర్, సెప్టెంబరు25: గ్రామాల్లో అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, బీజేపీ సభ్యత్వ నమోదు నియోజకవర్గం పర్యవేక్షకులు ఇనుగాల పెద్దిరెడ్డి పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణికుంట గ్రామంలో పర్యటించారు. సభ్యత్వ నమోదు మండల సహ ప్రముఖ్ గడ్డం అరుణ్, మండల ఉపాధ్యక్షులు తమ్మనవేణి రాజు, జంగ సునీల్ రెడ్డి, గొల్లపల్లి మల్లేశం, కాల్వ శ్రీనివాస్, బండి స్వామి పాల్గొన్నారు.

ఏకశిలలో సీడ్ బాల్స్ కార్యక్రమం

హుజూరాబాద్, సెప్టెంబరు 25: హుజూరాబాద్ పట్టణ శివారులోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో వాసవి వనిత క్వీన్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సీడ్ బాల్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నవధాన్యాలు, తులసి, వేప, మర్రి, సపోటా, జామ తదితర సీడ్‌బాల్స్ తయారు చేశారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, వాసవి వనిత క్వీన్ క్లబ్ ప్రెసిడెంట్ శైలజ, సెక్రటరీ హిమబిందు, ట్రెజరర్ స్వప్న, ప్రిన్సిపాల్ దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తు రూపశిల్పులు కావాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు25: విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి రేపటి రూపశిల్పులు కావాలని అంతరిక్ష శాఖ మాజీ శాస్త్ర వేత్త, శిక్షా-జ్ఞానం జీవిత సలహాదారు డాక్టర్ టి.పి.శశికుమార్ అన్నారు. స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో 'రేపటి ఇంజనీర్లు - డ్రీమ్స్ డిజైన్ అండ్ డెలివర్' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, డీన్ పి.కే.వైశాలి, విభాగధిపతి జగదీషన్ పాల్గొన్నారు.

సీపీఎం శాఖ మహా సభలు ప్రారంభం

ఇల్లందకుంట: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా బాట పట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం శాఖ మహాసభలు ప్రారంభించి మాట్లాడారు. మహాసభల నూతన శాఖ కార్యదర్శిగా తిప్పరబోయిన శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



బాలికల వసతి గృహంలో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహ సముదాయాన్ని కలెక్టర్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్‌ను, కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో బాలికలకు సరిపడా బెడ్స్‌ను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎం అనిల్ ప్రకాష్, వార్డెన్ శ్రీదేవి ఉన్నారు.

క్షయ నిర్మూలనకు చర్యలు

సుభాష్‌నగర్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో టీబీ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ప్రాణాంతకమైన వ్యాధి కాదని అదుపు చేయవచ్చన్నారు. వారం రోజులు జ్వరం, దగ్గు ఉన్నవారిని గుర్తించి ఆసుపత్రిలో రక్త, గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఆరు నెలలలోపు వ్యాధిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల (చికిత్స కాలం మొత్తం) రూ.500 పోషణ భత్యం (పోషకాహారం తీసుకోవడం కోసం) ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జడ్పీసీఈవో శ్రీనివాస్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబరు 1న మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయో వృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, సముద్రాల జనార్దన్‌రావు, కేశవరెడ్డి, సీడీపీవో సబిత పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం కళాశాలలో 10 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించడం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనోహర్ హాజరు కాగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్ పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు

-బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 25: నగరపాలక సంస్థలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసులు పెట్టించి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్‌నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నగరపాలక సంస్థకు కేటాయించిన 143 కోట్లతో 60 డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించగా శ్రీరాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్ పేరుతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023 జూలై, ఆగస్టు మాసంలో పనులకు భూమిపూజలు చేసి ప్రారంభించారు. గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులను ఎక్కడికక్కడే చేయడం నిలిపివేశాడని బీఆర్ఎస్‌నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తెలిపారు. అక్కడక్కడ కొన్ని పనులు పూర్తి చేసిన సదరు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవలసిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఆయనతో కుమ్మక్కై చేసిన పనులకంటే ఎక్కువగా బిల్లులు రికార్డు చేసినట్లు సమాచారముందన్నారు. ఈ పనుల టెండర్లకు ముందే స్మార్ట్‌సిటీలో చేసిన పనులను సీఎం హామీ పథకం కింద చేసినట్లు చూపించి రూ.76 కోట్లు చెల్లించేందుకు బిల్ రికార్డు చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయికృష్ణ, నాయకులు చేతి చంద్రశేఖర్, ఆరె రవిగౌడ్, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు బుధవారం తెలంగాణ చౌక్ వద్ద సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా సుమారు 50 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే హాని గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్ల బాషల్లో నినాదాలు చేశారు. అలాగే ప్లాస్టిక్ వల్ల పర్యావరణం ఎలా ప్రభావితమవుతుందో తెలియజేసే పోస్టర్లు,బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డ్రా ఇప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25: నగరపాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను డిసెంబరులోగా నూరుశాతం వసూలు చేయా లని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో ఆస్తిపన్ను వసూళ్ళపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బిల్‌కలెక్టర్లు పన్నుల వసూళ్ళపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. 44 కోట్ల డిమాండ్ పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని అన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఆస్తిపన్ను వసూళ్ళ సమయంలో ఫీల్డ్‌లెవల్‌లోకి వెళ్ళి పరిశీలించాలని ఆదేశించారు. కొత్త అసెస్‌మెంట్ల విషయంలో తప్పని సరిగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారి గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు



ఎమ్మెల్యే గంగులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 25: కరీంనగర్ కార్పొరేషన్‌లో కరీంనగర్ మండలంలోని గ్రామా లను విలీనం చేయవద్దంటూ దుర్శేడ్, గోపాల్ పూర్ గ్రామ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా విలీనం జరిగితే తమ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. తమ గ్రామంలో ఎక్కువ మంది రైతులు, కూలీ పని చేసే వారు అత్యధికంగా ఉన్నారని, విలీనం జరిగితే ఆర్థికంగా రోడ్డున పడుతారని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పందించి విలీన ప్రక్రియన ఆపాలంటూ త్వరలోనే సీఎంకు లేఖ రాస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ ఊరడి మల్లారెడ్డి, దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకి శాల సంపత్ రావు, ఆరె శ్రీకాంత్, గోనె నర్సయ్య, నేరేళ్ళ శ్రీనివాస్, అశోక్, రాజ్‌కమల్, కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి పులకరించే పండుగ బతుకమ్మ



వేడుకల్లో పాల్గొన్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 25: ప్రకృతి పులకరించే, ఆరాధించే పండుగ బతుకమ్మ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో బతుకమ్మ ఉత్సవ్ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పండుగ బతుకమ్మ అన్నారు. ఊరు వాడా తేడా లేకుండా రెట్టింపు ఉత్సాహంతో వైభోవోపేతంగా నిర్వహించుకుంటారన్నారు. సమాజంలో ఐక్యత, ప్రేమ, అనురాగాన్ని ఆవిష్కరించే పండుగ అన్నారు. ప్రకృతి ఒడిలో దొరికేటటువంటి వివిధ రంగుల పూలతో అందంగా అలంకరించి గౌరీమాత కృపనుపొందుతారన్నారు. ప్రాంగణంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలుఅలరించాయి. దసరా మహోత్సవ సంబరం, శమిపూజ, వాహనపూజ, ఆయుధ పూజ, రావనాసరుని వధ నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నర్సింగాపూర్‌లో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వీణవంక, సెప్టెంబర్ 25: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందిన మండలానికి చెందిన 42 చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేశాయిపల్లిలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారం దక్కించుకున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని అన్నారు. రైతుల రుణమాఫీ కేవలం నలుభై శాతం చేశారని, రైతు భరోసా, దళిత బంధు పథకం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పలపల్లి,మామిడాలపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు మృతి చెందగా వారి కుటుంబాలకు రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాడ సాధవరెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి,పత్తి కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహితపై ప్రభుత్వ ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన?

జమ్మికుంట, సెప్టెంబర్ 25: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ వివాహిత ఆదివారం రాత్రి 100కి ఫోన్ చేసినట్లు తెలిసింది. పోలీస్‌లు ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి అసలు విషయం ఏమిటని ఆరా తీశారు. సదరు మహిళ భర్త ఉపాధ్యాయుడి క్రెడిట్ కార్డు వాడుకున్నాడని, వాటికి సంబంధించిన డబ్బులతో పాటు ఇంటి అద్దె విష యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.వివాహిత మాత్రం అలాంటిది ఏమీ లేదని, చిన్న మనస్పర్థలతో పోలీస్‌స్టేషన్ వరకు వచ్చినట్లు చెప్పినట్లు తెలిసింది. పట్టణ సీఐ వరంగంటి రవిని వివరణ కోరగా తమ వద్దకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 25: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఇల్లందకుంట మెడికలాఫీసర్ డాక్టర్ విజయగిరి తులసీదాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావు, డాక్టర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్ : జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి, సైదాబాద్ గ్రామాల్లో బుధవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్వైజర్లు, రత్నాకుమారి, సదానందం పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన

చొప్పదండి, సెప్టెంబరు 25: చొప్పదండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ అనూష విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరత్ రెడ్డి పోలీసు సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

● చొప్పదండి : చొప్పదండికి చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను ఈ నెల 15న పోగొట్టుకోగా సీఇఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బుధవారం ఎస్ఐ అనూష తిరిగి అతనికి అప్పగించారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాల్ జయంతి



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

హుజూరాబాద్, సెప్టెంబరు 25: హుజూరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో బుధవారం పండిట్ దీన్‌దయాల్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పండిట్ దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, నర్సింహారాజు, బింగి కరుణాకర్, గౌతమ్‌రెడ్డి, వెంకటరెడ్డి, వేణు, రాజు శ్రీనివాస్, రాజశేఖర్, నాగరాజు, దేవేంద్ర పాల్గొన్నారు.

● జమ్మికుంట: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 39వ బూత్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బింగి కరుణాకర్, చెన్నమాధవని నరసింహరాజు ఉన్నారు.

● మానకొండూర్: జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి బీజేపీ ఆధ్వర్యంలో మానకొండూర్‌లో బుధవారం జరిగాయి. మండలంలోని చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల్ల ఆంజనేయులు, బీజేపి జిల్లా ఉపాధ్యాయులు రంగు బాస్కరాచారి, మండల నాయకులు లక్ష్మణాచారి, ప్రదీప్, శ్రీనివాస్, కోటేశ్వర్, రఘు, సదానందం ఉన్నారు.

● ఇల్లందకుంట: మల్యాలలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు.

● చిగురుమామిడి: గాగిరెడ్డిపల్లిలో పండిట్ దీనదయాల్ జయంతిని నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25: నగరంలో గురువారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్‌కుమార్‌లు తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియా, పద్మనగర్, ప్రోస్టాప్ ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం, ప్రగతినగర్, లారెల్ పాఠశాల ప్రాంతం, సాయిబాబా ఆలయ ప్రాంతంలో విద్యుత్ సరపరా ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు బ్యాంక్‌కాలనీలో భాగం, మెహిఫిల్ బార్ వెనుక వైపు, అల్ఫోర్స్ ప్రధాన క్యాంపస్ ప్రాంతం, వావిలాలపల్లిలో కొంత భాగం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

28న షాపుల నిర్వహణకు వేలం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25: దేవాదాయశాఖ పరిధిలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గల 5 షాపుల నిర్వహణకు ఈనెల 28న మధ్యాహ్నం ఒంటి గంటకు కోర్టు సమీపంలోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాల కాల పరిమితికి గాను షాపులను నిర్వహించుకోవచ్చని, ఔత్సాహికులు టెండరు ఫారములకు దేవాదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు నివాళి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25: నగరంలోని ఫిలింభవన్‌లో బుధవారం జిల్లా సంగీత, సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి కార్యక్రమాన్ని పాడనా తీయగా ఒక కమ్మని పాట పేరుతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ జ్యోతి ప్రకాశం చేసి మాట్లాడుతూ బాలు లేని లోటు సంగీత, కళా, గాత్ర రంగాలకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు గోగుల ప్రసాద్, చిలువేరు శ్రీకాంత్, కోశాధికారి గౌరవేని బాబు, ప్రోగ్రాం కన్వీనర్ తిప్పబత్తిని రవి, గొల్లపల్లి రవీందర్, కెపి చారి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 25: రామడుగు మండలం వెదిరగ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు బుధవారం టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని ఒక ప్రకటనలో తెలిపారు.

బల్దియాలో ఇద్దరు ఉద్యోగులకు డిప్యూటేషన్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25: నగరపాలక సంస్థలో ఇద్దరు ఉద్యోగులను డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ సీడీఎంఎ ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్, రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులును సూపరింటెండెంట్‌గా రామగుండం కార్పొరేషన్‌కు, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్‌ను గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. కాగా, వారి స్థానాల్లో కొత్తవారికి ఎవరికీ ఇక్కడికి పోస్టింగ్ ఇవ్వలేదు.

యువజన ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల కరపత్రాన్ని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 15-29 సంవత్సరముల మధ్య వయస్సు కలిగిన యువత, విద్యార్థిని, విద్యార్థులు లోని కళనైపుణ్యాలను ప్రోత్సహించుటకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అచీవర్స్ బ్లూ కలర్ డే

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 25: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాలలో పాఠ్యాంశంలో భాగంగా ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు బుధవారం బ్లూ కలర్ డే నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు బ్లూ కలర్ దుస్తులు, వస్తువులు ప్రదర్శించి రంగులపై అవగాహన పెంపొందించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి చేశారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

రామడుగు, సెప్టెంబర్ 25 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి బుధవారం ముదిరాజ్ సంఘం నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్‌కు అప్పగించడాన్ని హర్షిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు జిట్టవేణి రాజు, ముదిరాజ్ సంఘం నాయకులు మామిడికుమార్, బాసవేణి శ్రీనివాస్, రెండ్ల రాములు, నరసయ్య ఉన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

చొప్పదండి: చొప్పదండికి చెందిన మున్సిపల్ కార్మికుడు కల్లెపల్లి అశోక్ అనారోగ్యంతో మృతిచెందగా ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందజేశారు.

● సంక్షిప్త సమాచారం..

● వీణవంక: మండల తహసీల్దార్ జి లక్ష్మణ్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ నిజామోద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు.

● తిమ్మాపూర్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మన్నెంపల్లి గ్రామంలో గల దళిత మహిళ సోదరిమణులకు బీజేపీ నాయకులు డీజే సౌండ్ బాక్సులు అందించారు.

● చొప్పదండి: తెలుగు విశ్వవిద్యాలయానికి అమర జీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలనే నిర్ణయం సరికాదని మండల ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

● గన్నేరువరం: తెలంగాణ టీచర్స్, లెక్చరర్స్ ఫోరం మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన లింగంపల్లి రమేష్ నియామకం అయినట్లు టీటీఎల్ఎఫ్ ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షుడు మాసం రత్నాకర్ నియామక పత్రాన్ని అందజేశారు.

● ఇల్లందకుంట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం హైద్రాబాద్‌లో జరిగే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని కరీంనగర్ పార్లమెంట్ ఉద్యమకారుల కన్వీనర్ ఎక్కటి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.

●హుజూరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబరు 24న జరిగే పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ పేర్కొన్నారు.

● శంకరపట్నం: కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని అమరణ దీక్ష చేసిన బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లోని సీవీఎం ఆస్పత్రిలో పద్మశాలి సంఘం మండల నాయకుడు గాజుల శ్రీనివాస్ పరామర్శించారు.

- శంకరపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జీ దేవునూరి కిష్టయ్య ఆధ్వర్యంలో బుధవారం మండల కమిటీ నియామకానికి సన్నాహక సమావేశం నిర్వహించారు.

● ఇల్లందకుంట: మండల వ్యవసాయ శాఖాధికారి ముప్పిడి సూర్యనారాయణ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు.